## క్లుప్తంగా

### గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి



గణేష్ ఉత్సవ నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ రామారావు

**మడకశిర:** పట్టణంలో గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ రామారావు సూచించారు. ఆదివారం పట్టణంలోని గణేష్ ఉత్సవాల నిర్వాహకులు, సభ్యులతో సమావేశమయ్యారు. మంగళవారం పట్టణంలో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవం జరుగుతుందని తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. ఇతర మతాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనం సందర్భంగా భారీ పోలీస్ బందోబస్తు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు జాబ్‌మేళా

**మడకశిర:** పట్టణంలోని యాదవ కల్యాణమండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగే మేళాలో టెన్త్, ఇంటర్, ఐటీఐ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వారు ఆపరేటర్లుగా చిత్తూరు లేదా తిరుపతిలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి



మట్టి తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

**సోమందేపల్లి:** మండలం కేంద్రలోని చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్న టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి డిమాండ్ చేశారు. మూడు రోజులుగా జేసీబీతో గుంతలు తవ్వి, ట్రాక్టర్లలో మట్టి తరలించి, సొమ్ము చేసుకుంటున్నా ఇరిగేషన్ అధికారులు పోలీసులు పట్టించుకోలేదన్నారు. చర్యలు తీసుకోక పోతే గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

### సాహితీ సాంస్కృతిక సమ్మేళనం

**గోరంట్ల:** స్థానిక ఎస్‌పీవీయం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మండల సాహితీసాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నైపుణ్యం సాధిస్తున్న ప్రముఖులతో ఆదివారం ఆత్మీయ సమేశనం నిర్వహించారు. సంస్కృతీ సంప్రదాయల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.అనంతరం పలు రంగాల్లో సేవలందించిన పలువురిని సన్మానించారు.


### ఉత్సాహంగా ఆటల పోటీలు



నడక పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

**హిందూపురం:** స్థానిక నింకంపల్లిలోని సరస్వతీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో 8 పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు, ఆచార్యులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాలల జిల్లా కార్యదర్శి కెవి.రాధాకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. పోటీల్లో పాఠశాల సభ్యుడు 70 ఏళ్ల వయస్సులో శంకరప్ప త్రోబాల్‌లో ప్రథమ, నడక పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. వివిధ పోటీలకు జడ్జీలుగా రుక్మిణి, కళావతి, అన్నపూర్ణ, మంజుల వ్యవహరించారు. కార్యక్రమంలో జయప్రకాష్ కె.రమేష్, బదరినాథ్, పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### అన్నదాన సత్రం నిర్వహణకు విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

**లేపాక్షి:** స్థానిక వీరభద్రస్వామి దేవాలయం పక్కన ఉన్న అన్నదాన సత్రం నిర్వహణకు ఆదివారం బెంగళూరుకు చెందిన ఫోర్టిస్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ నితిన్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.20 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

### వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయొద్దు



రాష్ట్రంలో ఎంబీబీఎస్ విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఆపార నష్టం కలుగుతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మొత్తం 17 మెడికల్ కాలేజీలను నిర్మించి, వైద్య విద్యతో పాటు వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేశారు. ఈనేపథ్యంలో పెనుకొండలో మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులు జరిగాయి. కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం విరమించుకొని, మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– శివశంకర్, పరిగి



### వైద్య విద్యపై రాజకీయాలు దురదృష్టకరం



ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైద్య విద్యపై రాజకీయాలు చేయడం దురదృష్టకరం. ఇందులో భాగంగా పెనుకొండలో ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు నిలిపి వేయడం శోచనీయం. దీనివల్ల పేద దళిత వర్గాల పిల్లలకు తీరని అన్యాయం జరుగుతుంది. నా కూతురు నీట్ పరీక్ష రాసి క్వాలిఫై అయింది. అయితే ప్రభుత్వం సీట్ల సంఖ్య తగ్గించడంతో ఏం జరుగుతుందో తెలియడం లేదు. ప్రభుత్వం మరోసారి ఆలోచించి రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుమతి తీసుకొచ్చి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి.

– ప్రసాద్, పేలుబండ, నీట్ విద్యార్థిని తండ్రి, అమరాపురం మండలం

# దానిమ్మతో కాసుల వర్షం



రైతు రంగస్వామి తోటలో విరగ్గాసిన దానిమ్మ కాయలు



దానిమ్మ కాయలను బాక్సుల్లో నింపుతున్న దృశ్యం

- మడకశిర డివిజన్‌లో భారీగా సాగు
- ఉద్యాన పంటల సాగుపై రైతుల మొగ్గు

**మడకశిరరూరల్:** ఏటా వేరుశనగ పంటను సాగు చేసి ఎక్కువ మంది రైతులు నష్టాపోతునే ఉన్నారు. ఈ నేపథ్యంలో బోరుబావుల కింద రైతులు ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అందులోనూ దానిమ్మ పంటకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతుల ద్వారా పంట సాగు చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. ఖర్చులు పోనూ ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు.

**గత ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత**

గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల సాగును ప్రోత్సహించింది. రైతులకు మూడేళ్లపాటు మొక్కల సంరక్షణకు ప్రభుత్వమే బిల్లులు చెల్లించింది. అర్హత ఉన్న రైతులకు సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించింది. అదే విధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు సూచనలు, సలహాలను అందించి రైతులను పండ్ల మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించింది. ఉచిత వైఎస్సార్ పంటల బీమా సౌకర్యం కల్పించి అండగా నిలిచింది.

**మడకశిర డివిజన్‌లో 1,808 ఎకరాల్లో దానిమ్మ సాగు**

మడకశిర డివిజన్‌లో దాదాపు 1,808 ఎకరాల్లో రైతులు దానిమ్మ పంటను సాగు చేశారు. మడకశిర మండలంలో 725 ఎకరాలు, అగళిలో 55 ఎకరాలు, అమరాపురంలో 478 ఎకరాలు, గుడిబండలో 270 ఎకరాలు, రొళ్లలో 280 ఎకరాల చొప్పున 1,808 ఎకరాల్లో పంట సాగైంది. మార్కెట్‌లో టన్ను దానిమ్మ కాయల నాణ్యతను బట్టి రూ.1.50 లక్షల నుంచి రూ.2.60 లక్షల వరకు ధర ఉంది.

### పది ఎకరాల్లో దానిమ్మ సాగు



బోరు బావి కింద సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ డ్రిప్ కింద పదెకరాల్లో దానిమ్మ పంట సాగు చేశా. ఇప్పటికే ఐదు ఎకరాల్లో దానిమ్మ పంట కోతకు వచ్చింది. 15 రోజుల తర్వాత కాయలను తొలగించి మార్కెట్‌కు తరలిస్తాం. మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో ఆదాయం బాగా వస్తుందని ఆశిస్తున్నా.

– రవికుమార్, తురుకువాండ్లపల్లి, మడకశిర మండలం

### రూ.20 లక్షలకు పైగా ఆదాయం



వేరుశనగ పంటసాగు చేసి ఏటా నష్టాలు చవిచూసేవాడిని. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ డ్రిప్ ద్వారా ఐదెకరాల్లో దానిమ్మ పంట సాగు చేశాను. ఇప్పటికే రూ.11 లక్షల వరకు ఆదాయం వచ్చింది. మార్కెట్‌లో మంచి ధర ఉంది. ఈ ఏడాది ఖర్చులు పోనూ రూ.20 లక్షలకుపైగా ఆదాయం వస్తుందనకుంటున్నా.

– రంగస్వామి, రైతు, అయ్యవారిపల్లి, మడకశిర మండలం

### వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా గజేంద్ర



గజేంద్ర

**సోమందేపల్లి:** వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా గజేంద్రను నియమించినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు సమన్వయకర్త ఉషా శ్రీ చరణ్ ఆదివారం తెలిపారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ అధ్యక్షురాలు మాట్లాడుతూ పార్టీ పదవుల్లో అన్ని వర్గాలకూ న్యాయం చేస్తామన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి చురుగ్గా పనిచేస్తూ, ప్రస్తుతం ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆయన కొనసాగుతున్నాడు. అందరి సహకారంతో పార్టీను మరింత బలోపేతం చేస్తానని ఆయన తెలిపారు.

### ఆర్టీఐ యాక్ట్‌ను ఉల్లంఘించిన అధికారులు

**హిందూపురం:** హిందూపురంలో విద్యుత్ శాఖ అధికారులు ఆర్టీఐ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని కరుణాపురానికి చెందిన ఫకృద్దీన్ తెలిపారు. అర్జీదారుడికి 30 రోజుల గడువులోపు సమాచారం ఇవ్వాల్సి ఉన్నా హిందూపురం ట్రాన్స్‌కో అధికారులు తిరస్కరిస్తున్నారంటూ కలెక్టర్‌కు పంపిన అర్జీలో వాపోయారు. ఆగస్టు 2వ తేదీ సమాచారం కోరుతూ విద్యుత్ శాఖ పౌర సమాచార అధికారికి రిజిస్టర్ పోస్టు ద్వారా లేఖ పంపించడం జరిగిందన్నారు. అయితే 40 రోజులు దాటినా ఇంతవరకు సమాచారం అందలేదన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన ఇంకొక సమాచారం కోరుతూ మళ్లీ రిజిస్టర్ పోస్టు పంపిస్తే ఆ లేఖను తీసుకోవడానికి విద్యుత్ శాఖ అధికారులు తిరస్కరించారని తెలిపాడు. జిల్లా కలెక్టర్ విచారణ జరిపి ఆర్టీఐ చట్టం ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

# వైభవంగా వినాయక నిమజ్జనం



రొళ్లలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు



పావగడలో కొనసాగుతున్న వినాయకుడి శోభాయాత్ర



అమరాపురం: కనకనపల్లిలో నిమజ్జనానికి వెళుతున్న వినాయకుడు

**మడకశిరరూరల్:** మండలవ్యాప్తంగా ఆదివారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. బుళ్లసముద్రం ఓసీ, బీసీ కాలనీల్లో కొలువుదీరిన గణనాథులను ట్రాక్టర్లపై ఉంచి ఊరేగింపు చేపట్టారు. యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలతో ముందుకు సాగారు.

**రొళ్ల:** రొళ్ల శనేశ్వర ఆలయ ఆవరణలో కొలువుదీరిన వినాయక విగ్రహంతో పాటు దొమ్మరహట్టిలో ఆదివారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రొళ్లలో వినాయకుడిని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం సమీపాన బావిలోని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. దొమ్మనహట్టి వినాయకుడిని హలికుంట చెరువులో నిమజ్జనం గావించారు.

**పావగడ:** పట్టణంలోని ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమంలో వైభవంగా జరిగింది. రైన్ గేజ్ ఎక్స్‌టెన్షన్‌లో వినాయకుడిని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. వందలాది మంది యువకులు, మహిళలు డప్పు వాయిద్యాలకు దీటుగా నృత్యం చేశారు. వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి 9 రోజులు కావడంతో అధిక సంఖ్యలో వినాయకుల నిమజ్జనం జరిగింది.

**అమరాపురం:** కనకనపల్లి, అమరాపురం అంబేడ్కర్ కాలనీలో ఆదివారం నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. యువతీ యువకులు డీజే పాటలకు నృత్యం చేశారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



మడకశిర మండలం బుళ్లసముద్రం బీసీ కాలనీలోని వినాయక ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



జనం మధ్య ఊరేగింపుగా వెళ్తున్న వినాయకుడు



బుళ్లసముద్రంలో ట్రాక్టర్‌లో గణనాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం



మడకశిరలో యువత కోలాహలం

# అక్రమ కేసులకు భయపడొద్దు



పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు సుహేబ్, షాజహాన్

**హిందూపురం:** సోమందేపల్లి మండలం జులకుంట వద్ద శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌ను హిందూపురం 17వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సుహేబ్, షాజహాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూపురం పరిధిలోని వాల్మీకి సర్కిల్ వద్ద మున్సిపాలిటీ స్థలాన్ని టీడీపీ నాయకులు కబ్జా చేశారని తెలిపారు. దీనిపై తాము మార్చి 30వ తేదీన ఏపీ లోకాయుక్తకు ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి చేస్తూ గత రెండు రోజులుగా బెదిరిస్తూ ఇంటిపై దాడికి కూడా యత్నించారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌లు కూడా ఉన్నాయని పార్టీ అధ్యక్షురాలికి తెలిపారు. అనంతరం ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ.. టీడీపీ నాయకుల బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడవద్దని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు.

# ఆగని ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

- రాత్రి వేళల్లో ఎంతో చాకచక్యంగా ఎత్తుకెళ్తున్న వైనం



కోడూరు థామస్ మన్రోతోపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లోని తీగ, ఆయిల్‌ను చోరీ చేసిన దృశ్యం

**చిలమత్తూరు:** మండలంలో గత కొన్ని నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ఎక్కువగా జరుగుతున్నాయి. విద్యుత్ సరఫరా ఉన్నా చోరీలు ఆగడం లేదు. జనావాసాల సమీపంలో ఉన్నా రాత్రి వేళల్లో ఎంతో చాకచక్యంగా ఎత్తుకెళ్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు, అందులోని ఆయిల్ విలువైనవి కావడంతో బరితెగిస్తున్నారు. చోరీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను బాగేపల్లి, చిక్‌బళ్లాపురం తదితర ప్రాంతాల్లో విక్రయించి వేలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా విద్యుత్‌శాఖ మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. విద్యుత్ సరఫరా ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్లను కిందకు దించి మరీ ఎత్తుకెళుతున్నారంటే.. ఇది ఇంటి దొంగల పనేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 44వ నంబర్ జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న జువారి సీడ్స్ ప్యాక్టరీ వద్ద నాలుగు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీకి గురైంది. అయితే విద్యుత్ అధికారులు మాత్రం ఎలాంటి విచారణ జరపకుండా గోప్యంగా ఉంచారు. విద్యుత్‌శాఖలోని అధికారులు ఈ చోరీలకు సహకరిస్తున్నారా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. కనీసం పోలీసులకు కూడా ఫిర్యాదు చేయకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. మండలంలో ఏతఊ లేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం, చోరీ అంశాలపై సాక్షిలో గత నెల 27న కథనం ప్రచురితమైంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా ప్రజా ప్రభుత్వ దినోత్సవం



మానవ హారంగా ఏర్పడిన విద్యార్థులు

**పావగడ:** ప్రపంచ ప్రజా ప్రభుత్వ దినోత్సవాన్ని పట్టణం లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది విద్యార్థులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి శిరా రోడ్డు వరకు ర్యాలీ సాగింది. అలాగే శనిమహాత్మ సర్కిల్ వద్ద భారీ మానవ హారం అందర్నీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ మాట్లాడుతూ రాజ్యాంగం మనందరికీ మెరుగైన జీవితాన్ని అందించిందన్నారు. స్వాతంత్ర్యానంతరం ప్రజా ప్రభుత్వ వ్యవస్థలో అందరికీ సమాన విద్య, సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించిందన్నారు. ప్రపంచ ప్రజా ప్రభుత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగం, ప్రజా ప్రభుత్వ ఆశయాలను రాబోయే తరాలకు అందించే దిశగా భారీ మానవ హారం, సరం లతో ప్రపంచానికి వినిపించేలా ఎలుగెత్తి చాటామన్నారు. పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన మహమ్మద్ మాజ్

**ధర్మవరం అర్బన్:** పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కూలి పని చేసే ఎల్లమ్మ ఆదివారం రాత్రి కళాజ్యోతి సర్కిల్ నుంచి గాంధీనగర్‌కు నడుచుకుంటూ వెళుతుండగా అదే రూట్‌లో వెళ్లే ఒక టూవీలర్ సితార హోటల్ వద్ద ఎల్లమ్మను వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఎల్లమ్మ ఎడమ కాలుకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా పట్టణంలోని మార్కెట్‌వీధికి చెందిన బంగారు షాపు నిర్వాహకుడు మహమ్మద్ మాజ్ పట్టణంలోని శ్మశాన వాటిక సమీపంలో రహదారిపై ఉన్న గుంత పూడుస్తూ ఉండగా కదిరిగేటు నుంచి ధర్మవరం టౌన్‌లోకి వస్తున్న ఒక టూవీలర్ మహమ్మద్ మాజ్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహమ్మద్‌మాజ్ తలకు తీవ్రగాయమైంది. అక్కడే ఉన్న అతని స్నేహితులు సాదిక్, జాకీర్, అఫన్, వసీంలు క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్

9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726